క్లుప్తంగా

పాఠ్య పుస్తకాల వితరణ



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

నాగలాపురం: మండలంలోని రాజులకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి బాబయ్య, జనార్దనరాజు సమక్షంలో అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రాజు విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకమ్మ ఆలయం వద్ద సోమవారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు.

నేటి నుంచి వారాహి అమ్మవారికి అభిషేకాలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి వారాహి అమ్మవారికి ఆషాఢ నవరాత్రి అభిషేకాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 4 ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనదలిచిన భక్తులు కౌంటర్‌లో రూ.300 చెల్లించి రశీదు పొంది పాల్గొనవచ్చని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



మైనర్ బాలుడికి కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

కేవీబీపురం: రోడ్డు ప్రమాదాలు, భద్రతపై అవగాహన లేని మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇస్తే ఆ వాహనదారుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని కోవనూరు క్రాస్ రోడ్డు వద్ద ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలకు జరిమానా విధించారు. వాహనపత్రాలు సరిగా లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు రోడ్డు భద్రత, ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మైనర్ బాలురకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి హైస్కూల్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు నల్లందుల గుణశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాజవేలు బుధవారం ఘనంగా సత్కరించారు. వారు పాఠశాలలో విద్యార్థులకు ఎంతో నైపుణ్యాలో కూడిన బోధన అందించి అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ హెచ్ఎం నిర్మల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పవన్‌కుమార్

వరదయ్యపాళెం: చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో విధులు నిర్వహించేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పీహెచ్‌సీ రెండో వైద్యాధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దివ్యాంగులకు రేషన్ పంపిణీపై సమీక్ష

వరదయ్యపాళెం: దివ్యాంగులకు, సీనియర్ సిటిజన్లకు ఈ నెల 30వ తేదీ లోపు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్ సుధీర్ రెడ్డి సూచించారు. ఆ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బంది, డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన మేరకు ముందస్తుగా దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్దకే సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.

ఏపీఐఐసీ క్వార్టర్స్ సమీపంలో ప్రైవేటు వ్యక్తులు భారీగా డంప్ చేసిన చెత్త





నిరసన తెలుపుతున్న ఏపీఐఐసీ క్వార్టర్స్ వాసులు



చెత్త డంపు.. భరించలేని కంపు..

- గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలోని ఇళ్ల మధ్య చెత్త డంప్
- గతంలో ఇదే కాలనీలో డయేరియాతో ముగ్గురు మృతి
- దుర్గంధం భరించలేకపోతున్న స్థానికులు
- పది రోజులుగా చెత్తను డంప్ చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు
- అధికారులు స్పందించి డంపు చేయకుండా చూడాలంటున్న కాలనీ వాసులు



కాలనీ సమీపంలో వెలసిన చెత్త డంపు

ఆ ప్రాంతంలో గతంలో కాలుష్యం వల్ల డయేరియా వ్యాప్తి చెంది ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఇప్పుడు అదే ప్రాంతంలో చెత్తను డంప్ చేయడంతో గత సంఘటనను గుర్తు చేసుకుని స్థానికులు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో ఏపీఐఐసీ కాలనీలో 80 కుటుంబాలు కాపురం ఉంటున్నాయి. కాలనీ పక్కనే ఉన్న స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు గత పది రోజులుగా చెత్తను డంపు చేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. మూడేళ్ల కిందట కాలుష్యం వల్ల ముగ్గురు చనిపోయారని.. మళ్లీ అలాంటి పరిస్థితులే ఎదురైతే తాము ఎలా నివాసం ఉండేది అని ఆవేదన చెందుతున్నారు. వర్షాలు పడితే మరింత ప్రమాదం పొంచి ఉందని, అధికారులు తక్షణం స్పందించి డంపు యార్డు లేకుండా చూడాలని కోరుతున్నారు.

రేణిగుంట: మండలకేంద్రానికి సమీపంలోని గాజులమండ్యం పరిసరాల్లో గతంలో తిరుపతికి చెందిన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రయత్నాలు చేయగా స్థానికులు అడ్డుకున్నారు. తమ పంచాయతీలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు ఒప్పుకోమని అప్పుడు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం ఎటువంటి హడావుడి లేకుండా చెత్తను తెచ్చి డంపు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

వెంటనే చెత్తను తొలగించండి..



మా ఇళ్ల పక్కన వేసిన చెత్త కుప్పను వెంటనే తొలగించండి. పది రోజులుగా సరిగా అన్నం కూడా తినలేక పోతున్నాము. ఇంటి బయటకు వస్తే విపరీతమైన దుర్వాసన వస్తోంది. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే భరించే పరిస్థితి లేదు మాకు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలి. -పి.నీలమ్మ, స్థానికురాలు, ఏపీఐఐసీ క్వార్టర్స్ గాజులమండ్యం

గతంలో డంపింగ్ యార్డ్‌ను అడ్డుకున్నాం..



ఇదేవిధంగా గతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే అందరూ అడ్డుకున్నాం. కానీ ప్రస్తుతం రాత్రి సమయాల్లో చెత్తను తెచ్చి కుప్పగా వేస్తున్నారు. అందువల్ల మళ్లీ డయేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని భయమేస్తుంది. ఏదైనా జరిగిన తర్వాత కాకుండా ముందుగా అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. -ప్రసాద్, స్థానికుడు, ఏపీఐఐసీ క్వార్టర్స్ గాజులమండ్యం

దుర్వాసన భరించలేకున్నాం..



గత పది రోజులుగా చెత్త వల్ల వచ్చే దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మూడు సంవత్సరాల కిందట మా కాలనీ, పక్క గ్రామంలో కాలుష్యం వల్ల తీవ్ర అనారోగ్య ఇబ్బందులు ఎదుర్కొన్నాం. జనాలు నివసించే ప్రదేశంలో చెత్తను డంపు చేయడం తగదు. అధికారులు తక్షణమే చెత్తను తొలగించాలి. -మాధవి, స్థానికురాలు, ఏపీఐఐసీ క్వార్టర్స్ గాజులమండ్యం

తెల్లవారుజామునే దుర్వాసన..



గత పది రోజులుగా ప్రైవేట్ వ్యక్తులు మా కాలనీకి పక్కన చెత్తను తెచ్చి వేస్తున్నారు. దీంతో తెల్లవారుజామున అధికంగా దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పుడే ఈ విధంగా ఉంటే వర్షాకాలంలో మరింత అధ్వానంగా ఉంటుందని భయమేస్తుంది. కాలనీ పక్కన చెత్తను డంపు చేయడం దారుణం. -పళనియప్పన్, ఏపీఐఐసీ క్వార్టర్స్ కాలనీవాసి, గాజుల మండ్యం

జేసీబీతో మామిడి చెట్లు పెకలించేశారు!



కూల్చేసిన మామిడి చెట్టు

నారాయణవనం: ట్రాక్టర్ దారి కోసం దౌర్జన్యంగా పొలంలోని మామిడి చెట్లను జేసీబీతో పెకలించివేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతులు ఏకాంబరం కథనం.. స్థానిక కోటవీధికి చెందిన అన్నామలైకి మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ పడివేటమ్మ ఎస్టీ కాలనీ సమీపంలోని భూములలో మేనల్లుడు ఏకాంబరం మామిడి సాగు చేస్తున్నాడు. అరణ్యంకండ్రిగ పంచాయతీకి చెందిన కృష్ణమూర్తి నాయుడు, అతని కుమారుడు అశోకచక్రవర్తి శనివారం రాత్రి జేసీబీతో అన్నామలై పొలం మీదుగా అనుమతి లేకుండా దౌర్జన్యంతో ఎగువన ఉన్న తమ పొలానికి దారి ఏర్పాటు చేసుకునే నెపంతో 8 మామిడి చెట్లను పెకలించారు. దీనిపై పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఏకాంబరం తెలిపారు.

స్వయం ఉపాధితో బలోపేతం కావాలి

సత్యవేడు: స్వయం ఉపాధి దిశగా సహాయక గ్రామ సంఘాల సభ్యులు బలోపేతం కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం డాక్టర్ డాంగేయాదవ్ అధ్యక్షతన గ్రామ సంఘాల సభ్యులతో సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని సంఘాల్లో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలని ఇన్‌చార్జ్ మేనేజర్ బాషా కోరారు.





మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే బియ్యపు, ఎమ్మెల్సీ సిపాయి, నూకతోటి రాజేష్

వైఎస్ జగన్‌తో భేటీ

శ్రీకాళహస్తి: విజయవాడలోని వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బియ్యపుమధు, సిపాయి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులు, కేసులపై అధినేత దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రభుత్వం వచ్చాక 300 ఇళ్ల పునాదులను ధ్వంసం చేశారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సత్యవేడు సమస్యలను రాజేష్ వివరించారు.

వెబ్‌ల్యాండ్‌లో సవరణలకు అవకాశం



మాట్లాడుతున్న తహసీల్దార్ సుధీర్‌రెడ్డి

వరదయ్యపాళెం: మండలంలో అయ్యవారిపాళెం, నెల్లటూరు, కోవూరుపాడు రెవెన్యూ గ్రామాల్లో తొలి విడత రీసర్వే పూర్తయిందని, ఈ గ్రామాల్లోని రైతులు ఈ నెలాఖరులోగా వెబ్‌ల్యాండ్‌లో జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) సవరణలు చేయించుకోవాలని తహసీల్దార్ సుధీర్ రెడ్డి, మండల భూ రీసర్వే అధికారి కిన్నెర వెంకటరమణయ్య కోరారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. రీసర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంతో అర్హులైన వారు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలకు అర్హత కోల్పోతున్నారన్నారు. అందువలన వీరికి ఈ నెలాఖరు వరకు సవరణలు చేయించుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని వారు వివరించారు. రైతులు సచివాలయాల్లో రూ.50 చలానా కట్టి ఈ నెలాఖరు వరకు మాత్రమే జాయింట్ ఎల్‌పీఎం నుంచి తమ పేర్లను తొలగించుకుని ప్రత్యేక సర్వే నెంబర్ల ద్వారా వెబ్‌ల్యాండ్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈవెనింగ్ స్టడీ సెంటర్ ప్రారంభం



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్ నగేశం

రేణిగుంట: పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో రేణిగుంటలోని ఆర్‌సీఎం పాఠశాలలో బుధవారం సాయంత్రం పేద విద్యార్థుల సౌకర్యార్థం ఈవెనింగ్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రేణిగుంట సర్పంచ్ నగేశం చేతుల మీదుగా పుస్తకాలు, విద్య సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మమహిళా మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ జూలియన్ రాజు మాట్లాడుతూ ప్రైవేట్ ట్యూషన్‌కు వెళ్లలేని పేద విద్యార్థులకు తమవంతు సహాయంగా స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు సాయంత్రం స్టడీ సెంటర్‌లో ఇద్దరు టీచర్లు ఉచితంగా విద్యను బోధిస్తారని తెలిపారు. పేద విద్యార్థుల చదువు కోసం తమవంతు సహాయం చేసేందుకు ఎప్పుడు ముందుంటామన్నారు. సర్పంచ్ నగేశం మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఈవెనింగ్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుమశ్రీలక్ష్మి, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులు అర్పిస్తున్న కోగిల సుబ్రహ్మణ్యం

తొట్టంబేడు: మండలంలోని తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి ఎస్సీ కాలనీలో కొప్పుల వెంకటమ్మ అనారోగ్యంతో మరణించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం మృతురాలు మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

అనధికారికంగా ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు వేసుకోవద్దు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: ప్రెస్, పోలీసు స్టిక్కర్లను తమ వాహనాలపై అనధికారికంగా వేసుకుంటే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పర్యవేక్షణలో బుధవారం రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. అందులో అనధికారికంగా ప్రెస్ 3, పోలీసు 2 స్టిక్కర్లతో ఉన్న వాహనాలను పట్టుకున్నారు. మొదటి తప్పుగా కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకపోయినా తమ వాహనాలపై ప్రెస్, పోలీసు స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు తెలిసిందన్నారు. అలా వేసుకోవడం నేరమని, గుర్తింపు కార్డులు లేకుండా ఇలాంటి స్టిక్కర్లు వేసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, అలాగే వారి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోవిందు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఇద్దరు విద్యార్థినులను పాఠశాలలో శాలువా కప్పి ఆర్థిక సాయాన్ని అందించారు. హెచ్ఎం సులోచన మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచి, ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన విజి మాఘలక్ష్మి, హేమావతికి సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు మునివేలు రూ.1,116 చొప్పున ఆర్థిక బహుమతిని అందజేసినట్లు హెచ్ఎం సులోచన తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలు అవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న పథకంలో మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన బుధవారం గోవిందప్పనాయుడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలసి చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరమైన భోజనం అందించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన



జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్థల పరిశీలన చేస్తున్న అధికారుల బృందం

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు కమిటీ బుధవారం వరదయ్యపాళెం జూనియర్ కళాశాలను సందర్శించారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి ప్రభుత్వానికి విన్నవించిన ఎన్టీఆర్ వెంకయ్యతో కలసి రెండవసారి వరదయ్యపాళెం జూనియర్ కళాశాలను సందర్శించారు. శ్రీకాళహస్తి, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ వై.నాగరాజు నాయుడు, డాక్టర్ సుజాత, వచ్చారు. వీరు వరదయ్యపాళెం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘుపతితో కలసి స్థల పరిశీలన చేశారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉన్నట్లు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న బంజారా నేతలు

రేణిగుంట: బంజారాలు నివాసం ఉండే కాలనీని రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను బంజారా అభివృద్ధి కమిటీ సభ్యులు కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీలో ఉండే సర్వే నంబర్ 341/1, 2, 3లో సుమారు 150 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బంజారా అధ్యక్షుడు బాలాజీ నాయక్, నారాయణస్వామి నాయక్ పాల్గొన్నారు.

రాత్రివేళ వైద్యసేవలు అందించండి

రేణిగుంట: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చక్రపాణిని బుధవారం సర్పంచ్ నగేశం, ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ రేణిగుంటలో రాత్రి సమయంలో పేదలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని, వైద్యసేవలు అందించాలని కోరారు.

కళత్తూరులో ఆగిన ఉపాధి పనులు

వరదయ్యపాళెం: మండలంలోని కళత్తూరు గ్రామ పంచాయతీలో గత ఆరు నెలలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు జరగడం లేదు. దీంతో పంచాయతీ పరిధిలోని ఉపాధి కూలీలు ఉపాధి కోల్పోయారు. పలు కుటుంబాల కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి ఉండగా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఉపాధి హామీ పథకంకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తి స్థానికంగా అక్రమాలకు పాల్పడి, ఆ పథకం ద్వారా నిధులను పక్కదారి పట్టించాడు. దీనిపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టి సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారు. దీంతో గత ఆరు నెలలుగా కళత్తూరు గ్రామ పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయలేదు. దీని కారణంగా పనులు ఆగిపోయాయి. ఈ విషయమై స్థానిక కూలీలు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయకపోగా పనులు సైతం జరగనివ్వడం లేదు. దీంతో ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్న పలువురు కూలీలకు అవస్థలు పడుతున్నారు. కనీసం గతంలో పని చేస్తున్న కూలీలలో ఒక సీనియర్ మేట్‌ను గుర్తించి వారి ద్వారా పనులు చేపట్టాలని స్థానిక కూలీలు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కళత్తూరులో ఉపాధి హామీ పనులు కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చంద్రప్రభ వాహనంపై పరాశరేశ్వరస్వామి



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బుధవారం సాయంత్రం చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. 6 గంటలకు ఉత్సవర్లు తిరుచ్చి వాహనంలో ధ్వజస్తంభం వద్ద కొలువుదీరాయి. ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించిన అర్చకులు నందీశ్వరుని చిత్రపటాన్ని వస్త్రాన్ని అధిరోహింప చేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 10 గంటలకు ఉత్సవర్లను స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు చంద్రప్రభ వాహనాన్ని అధిష్టించారు. సర్కారు హారతి అందుకున్న దేవేరుల ఊరేగింపు పురవీధుల్లో శివనామస్మరణలు, భక్తుల కోలాటాల మధ్య జరిగింది. ఉత్స వాల్లో రెండోరోజు గురువారం సాయంత్రం సింహవాహనం అధిష్టించి ఊరేగింపులో భక్తులకు దర్శనమివ్వనున్నారు. టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ రవి, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

హాస్టల్ విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖినది కరకట్ట వద్ద ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులు మంగళవారం కలుషిత ఆహారం తినడంతో 16 మంది అస్వస్థకు గురైన విషయం విదితమే. వీరంతా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా.. బుధవారం డిశ్చార్జ్ అయి హాస్టల్‌కు చేరుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ హాస్టల్‌కు వెళ్లి పరామర్శించారు. ఫుడ్ పాయిజన్ ఏ విధంగా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో బీసీ హాస్టల్‌లో జరిగిన సంఘటనపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తోందని, ఒక్కో విద్యార్థికి మెస్ చార్జీ రూ.38 మాత్రమే అందజేస్తుందన్నారు. ఏవిధంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఒక్కో విద్యార్థికి రూ.150 చొప్పున మెస్ చార్జీలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు కాస్మొటిక్స్ నిధులను పెంచాలని, హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో తమ పార్టీ తరఫున పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.